APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ గురువారం 17 సెప్టెంబరు 2026 సంపుటి: 01 సంచిక :112 పేజీలు : 04 వెల: 2-00/-

## తిరుమల బ్రహ్మోత్సవాలు - వైభవంగా శ్రీవారి చిన్నశేష వాహన సేవ



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో

రెండో రోజు చిన్నశేష వాహనం వైభవంగా సాగింది.

మలయప్ప స్వామివారు చిన్నశేష వాహనంపై

పాండురంగస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తిరుపతి : తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు చిన్నశేష వాహనం వైభవంగా సాగింది. మలయప్పస్వామి ఐదు తలల చిన్నశేష వాహనంపై పాండురంగస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవిందనామ స్మరణ మధ్య తిరువాడ వీధుల్లో విహరించారు. దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన కళాబృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని వాహనసేవలో మిగతా..2లో

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆ ఇద్దరూ మళ్లీ అధికారంలోకి తెస్తారు




రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ మధ్య పూర్తి సమన్వయం ఉందన్న శ్రీధర్ బాబు

రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలో కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందని వ్యాఖ్య

అసెంబ్లీని సుదీర్ఘంగా నిర్వహించడం బీఆర్ఎస్ నేతలకు నచ్చదని విమర్శ

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమన్వయం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో పయనిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో చర్చించాలనే తాము భావించామని... అయితే సభకు ముఖం చాటేసే వ్యూహంతోనే కావాలని గందరగోళం సృష్టించి వారు మిగతా..2లో

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన



2

★ ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

★ శనివారం సాయంత్రానికి అల్పపీడనం ఏర్పాటుకు సూచనలు


★ ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం

★ ప్రభావంతో వచ్చే వారం రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్

★ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక వెల్లడి

# మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం.. వారణాసి వెళుతున్న సీఎం చంద్రబాబు

- ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై వారణాసిలో ప్రత్యేక కార్యక్రమం
- 'సేవా సంకల్ప్ అభియాన్'కు హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- వారణాసి-వాద్‌నగర్ సేవా యాత్రలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- రేపు ఉదయం వారణాసికి బయలుదేరనున్న చంద్రబాబు
- పర్యటనలో భాగంగా కాశీ విశ్వనాథుని దర్శించుకోనున్న సీఎం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం (సెప్టెంబరు 17) వారణాసిలో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని కాశీలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా మోదీ అందించిన సేవలకు గుర్తుగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాని రాజకీయ జీవితంతో ముడిపడిన వారణాసి, ఆయన స్వస్థలం వాద్‌నగర్‌ను కలుపుతూ 'వారణాసివాద్‌నగర్ సేవా యాత్ర'ను చేపట్టారు. యువత, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థల భాగస్వామ్యంతో జరిగే ఈ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని సేవా యాత్రను ఫ్లాగ్ ఆఫ్ చేస్తారు. దేశాభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి అంశాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

### సీఎం పర్యటన వివరాలు

ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఉదయం 7:30 గంటలకు విజయవాడ నుంచి మిగతా..2లో

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు.. నెల్లూరులో ఆధునిక పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేశ్



- నెల్లూరులో ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ స్కూళ్లను ప్రారంభించిన మంత్రి
- వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ స్కూల్‌కు కార్పొరేట్ హంగులు
- డిజిటల్ తరగతులు, రోబోటిక్స్ ల్యాబ్, సింథటిక్ క్రీడా ప్రాంగణం వంటి ప్రత్యేకతలు
- పాఠశాల పనితీరుపై సమీక్ష.. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధికారులకు లోకేశ్ ఆదేశం మిగతా..2లో

## ఇరాన్‌పై యుద్ధం.. అమెరికా ఖజానాకు భారీ షాక్! నెలకు వి3 బిలియన్ల అదనపు భారం

★ ఇరాన్‌పై అమెరికా కొనసాగిస్తున్న యుద్ధం ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై భారీ భారాన్ని మోపుతోంది.

★ ఆరు నెలల్లోనే ఈ యుద్ధానికి అమెరికా సుమారు 38 బిలియన్ డాలర్లు ఖర్చు



ఆరు నెలల్లోనే ఈ యుద్ధానికి అమెరికా సుమారు 38 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు కాంగ్రెస్‌కు చెందిన నిష్పక్షపాత సంస్థ కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (జదీూ) తాజా నివేదికలో వెల్లడించింది. యుద్ధం కొనసాగితే ఖర్చు నెలకు మరో 3 బిలియన్ డాలర్ల చొప్పున పెరిగే అవకాశం ఉందని జదీూ అంచనా వేసింది. ఈ లెక్కలు 2026 ఆగస్టు 1 వరకు జరిగిన వ్యయాలను ఆధారంగా చేసుకున్నట్లు పేర్కొన్నారు.

### ద్రవ్యోల్బణంపైనా ప్రభావం

యుద్ధం కారణంగా అమెరికాలో ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని జదీూ తెలిపింది. 2027 తొలి మూడు నెలల్లో ద్రవ్యోల్బణం సుమారు 0.5 శాతం మేర పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి చుట్టూ ఏర్పడిన ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాలకు అంతరాయం ఏర్పడటం ధరలపై ఒత్తిడిని పెంచుతోంది. మిగతా..2లో

## పపువా న్యూగినియాలో అద్భుతం... 40 ఏళ్ల తర్వాత మళ్లీ కనిపించిన అరుదైన చేప



- పపువా న్యూగినియాలో వెలుగులోకి వచ్చిన స్నిపాక్ పైప్‌ఫిష్
- స్థానిక మహిళ వలకు చిక్కడంతో వెలుగు చూసిన అరుదైన చేప ఉనికి
- ఈ జాతిని 'అంతరించిపోయే చేపల' జాబితాలో చేర్చిన శాస్త్రవేత్తలు
- స్థానికులకు ఎప్పటినుంచో తెలిసినా శాస్త్రీయంగా నిర్ధారణ కాని వైనం

## UPI ఛార్జీలపై కాంగ్రెస్ విమర్శలు NOTAకు మోదీ కొత్త నిర్వచనం ఇచ్చారంటూ ఎద్దేవా!

- యూపీఐపై ఎండీఆర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన కాంగ్రెస్
- అమెరికా ఒత్తిడికి కేంద్రం తలొగ్గిందని జైరాం రమేశ్ ఆరోపణ
- నోటాకు కొత్త అర్థం చెప్పారంటూ ప్రధాని మోదీపై విమర్శ



ఢిల్లి : యూపీఐ లావాదేవీలపై కొత్తగా తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్ ) రాజకీయ దుమారం రేపుతోంది. రూ.2 వేలకుపైగా జరిగే కొన్ని వ్యక్తి నుంచి వ్యాపారికి (ప్2వీ) చేసే యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ విధించడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. మోదీ సర్కార్ అమెరికా ఒత్తిడికి కేంద్రం తలొగ్గిందంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జి జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా ప్రధాని నోటాకు కొత్త నిర్వచనం ఇచ్చారని అదే 'నరేంద్ర ఆన్‌గోయింగ్ ట్రంప్ అప్పీజ్మెంట్' అర్థం చెబుతున్నారని వ్యాఖ్యానించారు. యూపీఐపై ఇప్పటివరకు కొనసాగిన జీరో ఎండీఆర్ విధానాన్ని తొలగించి ఛార్జీలు విధించడం ద్వారా అమెరికా డిజిటల్ చెల్లింపుల సంస్థలకు ప్రయోజనం కల్పిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం గతంలో యూపీఐ ఉచితంగా ఉండటం వల్ల వీసా, మాస్టర్ కార్డ్ వంటి కార్డు నెట్‌వర్క్‌లకు మిగతా..2లో

## మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'.. పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు



2

★ అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై ప్రశ్నలు

★ పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్ఓసీ ఆరోపణ

★ గంగుల కమలాకర్ భూములపైనా మంత్రి వ్యాఖ్యలు

★ 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములని వెల్లడి

★ 47,440 ఎకరాలు తగ్గించినట్లు ప్రభుత్వం వెల్లడి

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

- కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.
- అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూముల వివరాలు వెల్లడించారు.
- గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు.
- అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి 30 రోజుల్లో విచారణ జరపాలని స్పష్టం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 295 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూములు వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా లేదా తేల్చాలని స్పష్టం చేశారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతానని, శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని ఘంటాపథంగా చెప్పారు. ' మిగతా..2లో

## తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం

సీఎం రేవంత్ రెడ్డితో తెలిపిన సింగపూర్ బృందం



- సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు సింగపూర్ ప్రతినిధులు అంగీకారం తెలిపారు.
- మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ ప్రణాళికలను అసెంబ్లీ ఛాంబర్ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వారికి వివరించారు.
- గ్లోబల్ సమ్మిట్‌కు రావాలంటూ సింగపూర్ బృందాన్ని ఆహ్వానించారు.

హైదరాబాద్ : తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం తెలిపింది. ఈ మేరకు అసెంబ్లీ ఛాంబర్లో సింగపూర్ ఇంధన వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం.. వారణాసి వెళుతున్న సీఎం చంద్రబాబు

ప్రత్యేక విమానంలో బయలుదేరి 9:35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ఉదయం 11:15 గంటలకు శ్రీ కాశీ విశ్వనాథుని దర్శించుకుంటారు. అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 3:10 గంటలకు వారణాసి నుంచి తిరుగుపయనమై సాయంత్రం 5:15 గంటలకు అమరావతికి చేరుకుంటారు.

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

అమరావతి: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

'సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు ఉంది. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు ఉంది. హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు ఉంది. జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు ఉంది. నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాలోని 24 మండలాల్లో 31 గ్రామాల్లో 439 ఎకరాలున్నాయి"
- రేవంత్ రెడ్డి, సీఎం

### త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతాం

మొత్తం రూ.లక్ష కోట్ల భూకుంభకోణం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూకుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ (ఎస్ఈటీ), మొత్తం భూకుంభకోణంపై నెలరోజుల్లో నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు చెప్పింది ధరణి పార్ట్- 1 మాత్రమేనని, త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతామని వెల్లడిచారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్నీ బయటపెడతామని తెలిపారు. ఈసారి సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు వచ్చేలా స్పీకర్ చూడాలని కోరారు. తన కళ్లల్లోకి చూసి మాట్లాడే ధైర్యం వాళ్లకు ఉండదని, టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతామని స్పష్టం చేశారు.

## మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'..

హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆ ఇద్దరూ మళ్లీ అధికారంలోకి తెస్తారు

సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ అస్సలు నచ్చవని విమర్శించారు. తమ పదేళ్ల పాలనలో అసెంబ్లీని అతి తక్కువ రోజులు నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే తట్టుకోలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలిచేస్తోందని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు.

## పపువా న్యూగినియాలో అద్భుతం... 40 ఏళ్ల తర్వాత మళ్లీ కనిపించిన అరుదైన చేప

ఢిల్లీ : దాదాపు 40 ఏళ్లుగా కనుమరుగైపోయిందని భావించిన ఒక అరుదైన మంచినీటి చేప తిరిగి ప్రత్యక్షమైంది. శాస్త్రవేత్తలు 1985లో చివరిసారిగా గుర్తించిన ఈ 'స్పినాక్ పైప్‌ఫిష్'ను పపువా న్యూగినియాలోని సెపిక్ నదిలో తాజాగా కనుగొన్నారు. స్థానిక ప్రజల సహకారం, వారి పరిజ్ఞానం వల్లే ఈ అరుదైన చేప ఉనికి బయటపడటం విశేషం. ఈ ఏడాది జూన్ నెలలో ఈ చేప కోసం గాలిస్తున్న పరిశోధకుల బృందం, ఫలితం లేక నిరాశతో వెనుదిరగడానికి సిద్ధమైన చివరి రోజున ఈ అద్భుతం చోటుచేసుకుంది. ఇంబండో గ్రామానికి చెందిన హెలెన్ అసు అనే స్థానిక మహిళ, రొయ్యల కోసం తన సంప్రదాయ చేతి వల 'ఉంబెన్'తో వేటాడుతుండగా రెండు పైప్‌ఫిష్ లు చిక్కాయి. పరిశోధకురాలు జెర్రికా ఏజ్‌బిగో వాటిని ఫోటోలు తీసి నిపుణులకు పంపగా, వారు అది స్పినాక్ పైప్‌ఫిష్ అని ధ్రువీకరించారు. సముద్ర గుర్రాల జాతికి చెందిన ఈ చేప సన్నని శరీరం, పొడవాటి ముట్టెతో విభిన్నంగా ఉంటుంది. ఆకుపచ్చ-గోధుమ రంగులో ఉండటం వల్ల నది ఒడ్డున ఉండే జలచర మొక్కలలో ఇది సులభంగా కలిసిపోతుంది. సముద్ర గుర్రాల మాదిరిగానే, మగ చేపలు తమ కడుపులోని సంచిలో పిల్లలను మోయడం వీటి ప్రత్యేక లక్షణం. శాస్త్రవేత్తలు దీనిని 'అంతరించిపోయిన చేపల' జాబితాలో చేర్చినప్పటికీ, స్థానిక ప్రజలకు దీని ఉనికి గురించి ఎప్పటి నుంచో తెలుసు. వారు దీనిని 'కరువెంగ్', 'ఇనాప్' వంటి స్థానిక పేర్లతో పిలుచుకుంటారు. దీన్ని బట్టి, శాస్త్రీయ రికార్డులలో లేనప్పటికీ ఈ జాతి ఆ ప్రాంతంలో మనుగడ సాగిస్తోందని అర్థమవుతోంది. ప్రస్తుతం పరిశోధకులు ఈ చేపల జీవనశైలి, ఇతర అంశాలపై మరింత లోతైన అధ్యయనం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

## షహజాద్ భట్టి నెట్‌వర్క్'ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన కేంద్రం

కేంద్రం హిట్ లిస్ట్ లో 'షహజాద్ భట్టి నెట్‌వర్క్'- ఉపా చట్టం పరిధిలోకి నెట్‌వర్క్- ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానంలో భాగంగానే నిర్ణయం తీసుకున్నట్లు అమిత్ షా ప్రకటన

ఢిల్లీ : పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న 'షహజాద్ భట్టి నెట్‌వర్క్' (ఎస్ బీఎన్)పై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ సంస్థను ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ కేంద్ర హోం శాఖ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉగ్రవాదంపై ప్రధాని మోదీ అనుసరిస్తున్న 'జీరో టాలరెన్స్' విధానంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ మేరకు అమిత్ షా 'ఎక్స్' వేదికగా ఒక పోస్టు పెట్టారు. "ఈ నెట్ వర్క్ , అంతర్జాతీయ సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, డ్రగ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడుతోంది. అంతేకాదు, అమాయక యువతను, చిన్నపాటి నేరస్థులను తీవ్రవాదం వైపు ప్రేరేపిస్తుంది. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, మత సామరస్యాన్ని లక్ష్యంగా చేసుకుని విద్వేషపూరిత డిజిటల్ మాధ్యమాల్లో విద్వేషపూరిత కంటెంట్‌ను ప్రచారం చేస్తోంది. ఈ నెట్ వర్క్ అక్రమ కార్యకలాపాలపై ఉపాతో పాటు భారతీయ న్యాయ సంహిత, ఆయుధాల చట్టం, ఆస్తుల ధ్వంసం నిరోధక చట్టం వంటి పలు చట్టాల కింద కేసులు నమోదయ్యాయి."
- అమిత్ షా, కేంద్ర హోంమంత్రి

దోపిడీలతో మొదలు పెట్టి నేర ప్రపంచంలోకి

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన షహజాద్ భట్టీ దోపిడీలతో మొదలు పెట్టి నేర ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. లాహోర్ అండర్‌వరల్డ్ నెట్‌వర్క్‌లోనూ అతడి పేరు వినిపించింది. అయితే, వర్గాల సమాచారం ప్రకారం, భట్టి పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)తో సంబంధం కలిగి ఉన్నాడు. అలాగే, సరిహద్దు గుండా ఆయుధాలు, మాదకద్రవ్యాలు,

## తిరుమల బ్రహ్మోత్సవాలు - వైభవంగా శ్రీవారి చిన్నశేష వాహన సేవ

మొదటి పేజి తరువాయి

పాల్గొని స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు: చిన్నశేష వాహనసేవ సందర్భంగా తిరుమలలో వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీ మలయప్పస్వామివారు దేవేరులతో కలిసి చిన్నశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. స్వామివారి వాహనసేవకు ముందు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమతమ సంప్రదాయ కళారూపాలను భక్తి, సంగీతం, నృత్య సమ్మేళనంతో ప్రదర్శించి భక్తులను పరవశింపజేశారు. ఈ సందర్భంగా 9 రాష్ట్రాలకు చెందిన 20 కళాబృందాల నుంచి 539 మంది కళాకారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం, మహారాష్ట్ర, పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ప్రాంతాల కళా



సంప్రదాయాలను తిరుమలలో ఆవిష్కరించారు. రాత్రి 7 గంటలకు హంస వాహనసేవ జరగనుంది. బ్రహ్మోత్సవాల్లో భాగమైన సీఎం: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి సీఎం హోదాలో 15వ సారి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో సీఎంకు పండితులు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. మరోవైపు తిరుమలలో మలయప్పస్వామి బ్రహ్మోత్సవాలు వైభంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, కుటుంబ సభ్యులు పెద్దశేష వాహన సేవలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ: తిరుమల శ్రీవారి ఆలయంలో సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సోమవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా శ్రీవారి తరఫున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలోని యాగశాలలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటారు. వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహించారు.

## తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం
# సీఎం రేవంత్ రెడ్డితో తెలిపిన సింగపూర్ బృందం

మొదటి పేజి తరువాయి

రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ నిర్వహించింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టడమే కాకుండా రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని కోరారు. దీంతో పాటు రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలించే అంశాలు, ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల గురించి కూడా సీఎం వారికి సమగ్రంగా వివరించారు.

మూసీ పునరుజ్జీవంతో నైట్ ఎకానమీకి ప్రోత్సాహం

సమావేశంలో సింగపూర్ ప్రతినిధి బృందానికి సీఎం రేవంత్ రెడ్డి మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు మొదటి దశలో భాగంగా మూసీ, ఈసీ నదుల సంగమ స్థలమైన గాంధీ సరోవరం వరకు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నదీతీర అభివృద్ధితో పాటు నైట్ ఎకానమీ వ్యవస్థను ప్రోత్సహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీని పూర్తిస్థాయి నెట్ జీరో నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కూడా వారితో సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

### గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం

హైదరాబాద్ నగరాన్ని కేవలం పర్యాటక కేంద్రంగానే కాకుండా గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి సింగపూర్ ప్రతినిధులతో వివరించారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ విద్యాసంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి అంగీకరించాయని వారికి తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక సేవలు అందించడం, పెట్టుబడుల గురించి ముఖ్యమంత్రి కోరగా సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో రాబోయే డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో



ప్రభుత్వం నిర్వహించనున్న ప్రతిష్టాత్మక తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు సింగపూర్ ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు.. నెల్లూరులో ఆధునిక పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేశ్

మొదటి పేజి తరువాయి

అమరావతి : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ.8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను



ప్రోత్సహించారు.

### కార్పొరేట్ హంగులతో ఆర్ఎస్ఆర్ స్కూల్

వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ.13.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు.

### ఫలితాలపై దృష్టి పెట్టండి: మంత్రి లోకేశ్

పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.శరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## UPI ఛార్జీలపై కాంగ్రెస్ విమర్శలు- NOTAకు మోదీ కొత్త నిర్వచనం ఇచ్చారంటూ ఎద్దేవా!

మొదటి పేజి తరువాయి

పోటీ పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించిందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా 0.4 శాతం ఎండీఆర్ ఎందుకు నిర్ణయించారో కేంద్రం వివరించాలని కోరారు. యూపీఐ ఛార్జీలపై 0.4 శాతం ఎండీఆర్ విధించడం వెనక కారణమేంటని జైరాం రమేశ్ ప్రశ్నించారు. డెబిట్ కార్డుల ఎండీఆర్ కూడా ఇదే స్థాయిలో ఉండటంతో అమెరికా కార్డు కంపెనీలు యూపీఐతో పోటీ పడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. యూపీఐని ఆర్థికంగా 'సస్టెయినబుల్'గా మార్చడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో ఆ వాదనకు ఈ నిర్ణయం ఎలా దోహదపడుతుందో చెప్పాలని ఆయన కోరారు.

### అమెరికా వాణిజ్య విధానాలపైనా విమర్శలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై అనుసరిస్తున్న విధానాలను కూడా జైరాం రమేశ్ తన విమర్శల్లో ప్రస్తావించారు. భారత్‌పై 100 శాతం సుంకాలకు సంబంధించిన బిల్లును అమెరికా ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టనున్నారని, సెనేట్ ఇప్పటికే దానికి ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. అదేవిధంగా భారతీయ వలసదారులపై అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన ఆరోపించారు. హెచ్ -1బీ వీసా వ్యయాలు పెరిగాయని, ఉద్యోగం కోల్పోయినవారిపై భవిష్యత్తులో తక్షణ బహిష్కరణకు సంబంధించిన నిబంధనలు రావచ్చని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత అమెరికా-భారత్ సంబంధాలపై తన రాజకీయ విమర్శల్లో భాగంగా చేశారు.

### 2017 జీఎస్ టీ రిడక్స్ అంటూ మరో విమర్శ

మరో పోస్ట్ లో ఎండీఆర్ నిర్ణయాన్ని 2017 జీఎస్‌టీ రిడక్స్ గా అభివర్ణించారు. యూపీఐ వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా ఉంచేందుకు ఛార్జీలు అవసరమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ నిర్ణయం వెనక కారణాలను మరింత స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆరోపణలకు బీజేపీ స్పందిస్తూ, యూపీఐ వినియోగదారులపై ఎలాంటి ఛార్జీ విధించడం లేదని కేంద్రం స్పష్టంగా చెప్పినప్పటికీ ప్రతిపక్షం తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తోందని విమర్శించింది. దీంతో యూపీఐ ఎండీఆర్ అంశం ప్రస్తుతం ఆర్థిక నిర్ణయాన్ని దాటి రాజకీయ చర్చగానూ మారింది. ఎన్ పీసీఐ కొత్త ఫ్రేమ్‌వర్క్ ప్రకారం



2026 అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొన్ని పర్సన్ టు మర్చంట్ (పీ2ఎం) యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తించనుంది. అధిక విలువైన లావాదేవీలకు గరిష్ఠ ఎండీఆర్ రూ.300గా ఉంటుంది. అయితే వినియోగదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడానికి ఎలాంటి ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే యూపీఐ లావాదేవీలు కూడా ఉచితంగానే కొనసాగుతాయి. రూ.2,000 వరకు ఉండే వ్యాపార లావాదేవీలకు కూడా కొత్త ఎండీఆర్ వర్తించదు.

## ఇరాన్‌పై యుద్ధం.. అమెరికా ఖజానాకు భారీ షాక్! నెలకు వి3 బిలియన్ల అదనపు భారం

మొదటి పేజి తరువాయి

ఆయుధ నిల్వలపై తీవ్ర ఒత్తిడి

యుద్ధంలో భారీగా ఆయుధాలను వినియోగించడం వల్ల అమెరికా సైనిక నిల్వలు కూడా తగ్గుతున్నాయి. ముఖ్యంగా దీర్ఘశ్రేణి ఖచ్చితత్వ క్షిపణులు సహా కీలక ఆయుధాల వినియోగం వేగంగా పెరిగినట్లు నివేదిక పేర్కొంది. ఈ నిల్వలను తిరిగి భర్తీ చేయడానికి ఐదేళ్ల వరకు సమయం పట్టే అవకాశం ఉందని జదీూ అంచనా వేసింది. దీంతో చైనా-తైవాన్ వంటి మరో పెద్ద సైనిక సంక్షోభం తలెత్తితే అమెరికా సైన్యం తక్షణమే స్పందించే సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### 90 బిలియన్ డాలర్ల అత్యవసర నిధులు?

జూలైలో సెనేట్ విచారణ సందర్భంగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆయుధ నిల్వలను తిరిగి నింపేందుకు దాదాపు 90 బిలియన్ డాలర్ల అత్యవసర నిధులు అవసరమని కోరారు. ఆయుధాల కొరత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇదిలా ఉండగా, జదీూ ఆడిటర్లకు రక్షణ శాఖ పూర్తిస్థాయిలో సహకరించలేదని నివేదిక పేర్కొంది.

### హోర్ముజ్‌పై దాడులతో ఇంధన సంక్షోభం

ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన మార్గమైన హోర్ముజ్ జలసంధి చుట్టూ దాడులు, ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. యుద్ధానికి ముందు ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ఈ మార్గం గుండా రవాణా



అయ్యేది. సరఫరాలు తగ్గడంతో చమురు, డీజిల్ ధరలు గణనీయంగా పెరిగాయి. అయితే జదీూ తాజా లెక్కల్లో ఇటీవల జరిగిన కొన్ని హోర్ముజ్ దాడులు, అమెరికా సైనిక స్థావరాలపై జరిగిన దాడుల ఖర్చు పూర్తిగా చేర్చలేదు. అలాగే యుద్ధానికి నిధులు సమకూర్చేందుకు భవిష్యత్తులో తీసుకునే రుణాల వడ్డీ వ్యయాలు కూడా ఇందులో లేవు. దీంతో వాస్తవ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది.

### అమెరికా బడ్జెట్‌పైనా భారం

ఇప్పటికే అమెరికా ఆర్థిక లోటు భారీ స్థాయిలో ఉంది. 2026 ఆర్థిక సంవత్సరం తొలి 11 నెలల్లో ఫెడరల్ బడ్జెట్ లోటు 2 ట్రిలియన్ డాలర్లకు చేరిందని జదీూ సెప్టెంబర్ 9న తెలిపింది. ఈ నేపథ్యంలో ఇరాన్ యుద్ధానికి పెరుగుతున్న వ్యయం ప్రభుత్వ ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచుతోంది. ఇరాన్ యుద్ధంలో ఇప్పటివరకు 18 మంది అమెరికా సైనికులు మరణించినట్లు =పబ్వతీం పేర్కొంది. యుద్ధం కొనసాగుతున్న కొద్దీ మానవ నష్టం, ఆయుధాల పునఃభర్తీ, ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం, ప్రభుత్వ వ్యయం వంటి అంశాలు అమెరికాకు కీలక సవాళ్లుగా మారుతున్నాయి. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాలతో పోలిస్తే ప్రస్తుత వ్యయం ఇంకా చాలా తక్కువగానే ఉన్నప్పటికీ, ఆరు నెలల్లోనే 38 బిలియన్ డాలర్ల వ్యయం, నెలకు మరో 3 బిలియన్ల పెరుగుదల అంచనా వేయడం అమెరికా ఆర్థిక, రక్షణ వ్యవస్థలపై యుద్ధ ప్రభావం ఎంత వేగంగా పెరుగుతోందో సూచిస్తోంది.

# చంద్రబాబు పాలనలో అంగడి సరుకుల్లా ఉద్యోగాలు

తాడేపల్లి, సెప్టెంబర్ 16 అనంత సూర్య : నిరుద్యోగ యువత ఏళ్ల తరబడి కష్టపడి చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే.. కూటమి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నియామకాలను అంగడి సరుకులా మార్చేస్తోందని వైయసఆర్‌సీపీ రాష్ట్ర యువజన సాధికారత విభాగం కన్వీనర్ సలాం బాబు ధ్వజమెత్తారు. డీఎస్సీ నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వరకు పరీక్షలు లేకుండా నియామకాలు చేపట్టే విధానం వెనుక పారదర్శకత ఎక్కడుందని ప్రశ్నించారు. అర్హత, మెరిట్‌కు తిలోదకాలిచ్చి నిబంధనలను తమకు అనుకూలంగా మార్చడం ద్వారా లక్షలాది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైయసఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సలాం బాబు.. ఉద్యోగ నియామకాలపై ప్రభుత్వం నిజంగా చిత్తశుద్ధితో ఉంటే సీబీఐ విచారణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ప్రెస్‌మీట్‌లో సలాం బాబు ఏమన్నారంటే.. ఉద్యోగాలను అంగడి సరుకులా మార్చేశా "కూటరుమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దోపిడీ ఏ సాయిలో ఉందో ప్రజలందరూ చూస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత ఉద్యోగాలను కూడా అమ్ముకునే స్థాయికి పరిస్థితిని తీసుకెళ్లారు. ఏళ్ల తరబడి కష్టపడి చదివిన నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతూ వేలాది ఉద్యోగాల భర్తీపై అనుమానాలకు తావిస్తున్నారు.



డీఎస్సీపై వైయసఆర్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్ రెడ్డి గారు, పార్టీ నేతలు ఆధారాలతో ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతోంది. నిరుద్యోగులు, విద్యార్థులు రోడ్లపైకి వచ్చి తమ భవిష్యత్తుపై ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు." పరీక్ష లేకుండా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగాలు ఎలా ? "డీఎస్సీ వ్యవహారం మరవకముందే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు పరీక్ష లేకుండా ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఒడిశా, పంజాబ్, తెలంగాణ, మిజోరం వంటి రాష్ట్రాల్లో రాత పరీక్ష ద్వారా నియామకాలు జరుగుతున్నాయి. మరి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరీక్ష లేకుండా ఉద్యోగాలు ఎందుకు? 2016లోనే పరీక్ష అవసరం లేదని జీవో ఇచ్చామని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పుడు అదే జీవోను అడ్డుపెట్టుకుని నియామకాలు చేపట్టడం పట్ల ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయి. అర్హత, మెరిట్‌ను నిర్ధారించేందుకు ఏపీపీఎస్సీ ద్వారా రాత పరీక్ష నిర్వహించా ఈ ద్వంద్వ విధానం ఎందుకు ? "డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా పోస్టులకు పరీక్ష అవసరం లేదని చెబుతున్న ప్రభుత్వం.. పోలీస్ నియామకాల్లో మాత్రం రాత పరీక్ష తప్పనిసరి అంటోంది. ఒకచోట పరీక్ష వద్దు.. మరోచోట పరీక్ష తప్పనిసరి అనే ఈ ద్వంద్వ విధానం ఎందుకు?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 ప్రకారం అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. పరీక్ష లేకుండా నియామకాలు చేపడితే తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టే అవకాశం ఉందనే అనుమానాలు మరింత బలపడతాయి. అందుకే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టాలి.' సీబీఐ విచారణకు సిద్ధమా చంద్రబాబూ ? మూడు నెలలుగా నిరుద్యోగులు, విద్యార్థులు డీఎస్సీ అవకతవకలపై ప్రశ్నిస్తున్నారు. కాకినాడలో తమ భవిష్యత్తు కోసం రోడ్డెక్కిన నిరుద్యోగులు, విద్యార్థి నాయకులు, కోచింగ్ సంస్థల నిర్వాహకులపై కేసులు పెట్టి భయపెడుతున్నారు. నిరుద్యోగులు ప్రశ్నిస్తే వారిని అణచివేయడం, కోచింగ్ సెంటర్లను బెదిరించడం ఇదేనా పాలన? వైయసఆర్‌సీపీ హయాంలో జరిగిన పరీక్షలైనా, మీ హయాంలో జరిగిన పరీక్షలైనా సీబీఐ విచారణకు సిద్ధం కావాలి. డీఎస్సీ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు వెనుకడుగు? వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నియామకాలకు వెంటనే రాత పరీక్ష నిర్వహించి, డీఎస్సీతో పాటు అన్ని నియామకాలపై నిష్పక్షపాత విచారణకు ప్రభుత్వం సిద్ధం కావాలి.'

# ట్రేల్లీస్.. చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలి

## - మంత్రి లోకేష్‌కు లేఖ రాసిన అమర్ యాదవ్



అనంతపురం, సెప్టెంబర్ 16 అనంత సూర్య : అనంతపురం జిల్లా కేంద్రంలో ఉన్న ట్రేల్లీస్ స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని, స్కూల్ యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా అమర్ యాదవ్ మాట్లాడుతూ.. లైంగిక వేధింపులకు గురైన విద్యార్థిని తల్లిదండ్రులను స్కూలు యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఘటన జరిగి పది రోజులు అవుతున్నా ఎందుకు గొప్యంగా ఉంచారని, పోలీసు అధికారులు ఎందుకు సమస్యను దాచారో చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రేల్లీస్ స్కూల్ యాజమాన్యానికి ఇవేమీ కొత్త కాదని చాలామంది బాధిత విద్యార్థినులను లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా లైంగిక వేధింపులకు గురైన చిన్నారి తల్లిదండ్రులు డబ్బులు డిమాండ్ చేశారని ట్రేల్లీస్ స్కూల్ యాజమాన్యం ఆరోపించడం తగదన్నారు. తల్లిదండ్రులను ఆదుకొని, వారికి భద్రతకు ఇవ్వాలని, తల్లిదండ్రులకు ఏమైనా జరగరాని ఘటన జరిగితే స్కూలు యాజమాన్యం బాధ్యత వహించాలని తెలిపారు. ఇంత జరుగుతున్నా.. జిల్లా విద్యాశాఖ అధికారులు కానీ, పోలీస్ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్రేలిస్ స్కూల్‌ను డీఈఓ ఎందుకు స్పందించలేదో, ఎందుకు స్కూల్‌ను పరిశీలించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిసు ్తన డీఈఓ ఆయబ్ హుస్సేన్ పైన చర్యలు తీసుకుని, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ బిడ్డకు ఇలా జరిగిందని స్కూల్ యాజమాన్యం ప్రశ్నిస్తే ఇది చిన్న విషయమేనని తేలిగ్గా మాట్లాడాలని విద్యార్థిని తల్లి మీడియాకు తెలిపారు. ప్రభుత్వం మహిళలకు విద్యార్థునులకు అనేక రకాల చట్టాలు తెచ్చి వారి భద్రతకు ప్రభుత్వం భరోసా ఇస్తుంటే, ఇలాంటి విద్యా సంస్థల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ట్రేల్లీస్ స్కూల్ యాజమాన్యంపై ఫోక్సో కేసు నమోదు చేసి, పాఠశాల గుర్తింపు రద్దు చేసి భవిష్యత్తులో ఇలాంటివి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేఖలో నారా లోకేష్‌కి విజ్ఞప్తి చేశారు.

# జగన్‌ను కలిసిన కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం, సెప్టెంబర్ 15 అనంత సూర్య : తాడేపల్లిలోని వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని బుధవారం జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వంలో మైనార్టీల మీద జరుగుతున్న దాడులు, అరాచకాలు గురుంచి కాగజ్ ఘర్ రిజ్వాన్ మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వివరించారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వంలో



మైనార్టీలకు సంక్షేమ పథకాలలో కూడా ఎంత మోసం చేస్తోందో వివరాంచారు. అలాగే రాబోయే స్థానికసంస్థల ఎన్నికలలో ఏవిధంగా పని చేయాలోమాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి వివరించారు. జగన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసుల్ ఆజమ్, తదితర మైనార్టీ నాయకులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

# ఎన్నికలొస్తున్నాయని దీక్షల డ్రామాలకు తెర లేపారు

అనంతపురం, సెప్టెంబర్ 16 అనంత సూర్య : స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో పాటు వైసిపి నాయకులు దీక్షల పేరుతో డ్రామాలకు తెరలేపారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. రాప్తాడు మండలం, హార్మోని సిటీ సమీపంలో 3కోట్ల నిధులతో నిర్మించిన, 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. స్థానిక ప్రజలు, టిడిపి నాయకులు ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి సబ్ స్టేషన్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక...తోపుదుర్తి, గౌరిదిండ్ల, ముత్తవకుంట్ల విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మించి ప్రారంభించామన్నారు. రాప్తాడు విద్యుత్ సబ్ స్టేషన్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం వల్ల స్థానికంగా విద్యుత్ సమస్యలు ఉండవని అన్నారు. త్వరలో బండమీదపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. ఆలమూరు, వేపకుంట విద్యుత్ సబ్ స్టేషన్ లు మంజూరవుతున్నాయని.. ప్యాదిండి, న్యామద్దల, దాదులూరు, కొండపల్లి, సోమలదొడ్డి, మన్నీలలో విద్యుత్ సబ్ స్టేషన్ల అవసరం ఉందన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ లభించడం వలన పంటల సాగుకు ఎలాంటి అవాంతరాలు ఉండవన్నారు. ఇప్పటివరకు రైతులకు సుమారు 11వందల ట్రాన్స్ ఫార్మర్లతో పాటు కండక్టర్ కేబుల్ అందజేశామని, మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో పాటు అధికారులు ఎప్పుడు ఏమి అడిగినా వెంటనే స్పందిస్తున్నారని అన్నారు. ప్రజలు కూడా సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ఆదా చేసుకోవచ్చన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో పాటు, ప్రస్తుతం రాప్తాడు



నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సమస్య ఉందని అయితే గ్రామాల్లో ఎక్కడ తాగునీటికీ ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక తీసుకొని నీటికి విద్యుత్ కి సమస్య లేకుండా చేస్తున్నారన్నారు. అయితే అధికారంలో ఉండగా ఏమీ చేయని కొందరు నాయకులు ఇప్పుడు జల దీక్షల పేరుతో నాటకాలు ఆడుతున్నారంటూ విమర్శలు చేశారు. ప్రకాష్ రెడ్డి గత ఐదేళ్లలో పేరూరు ప్రాజెక్టుకు నీరు అందించే పనులు పూర్తి చేసి ఉండి ఉంటే ఈరోజు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. అధికారంలో ఉండగా కనీసం సొంత గ్రామానికి రోడ్డు, విద్యుత్ సబ్ స్టేషన్ తెచ్చుకోలేని వ్యక్తి ఈరోజు మాపై విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్యకు ఇబ్బంది లేదన్నారు. హంద్రీ-నీవాతో పాటు పీఏబీఆర్ ద్వారా వీలైనంత చెరువులకు నీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరు నీటి విషయంలో, ప్రజలకు మంచి చేసే విషయంలో బాగా పనిచేస్తున్నారో ఆ పార్టీ నాయకులు కూడా ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. ప్రజలు అలాంటి వారిని గుర్తించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు.



# నిమజ్జనం ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎన్టీఆర్ జిల్లా రూరల్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ బి లక్ష్మీనారాయణ

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 16,(అనంత సూర్య ప్రతి నిధి): చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో వేదాద్రి గ్రామంలో నిమజ్జనం ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు అక్కడ ఏర్పాటులను పర్యవేషించి ఎటువంటి సంఘటన జరగకుండా ముందస్తుగా ఏర్పాట్లను తీసుకోవాలని చిల్లకల్లు ఎస్సైలు టి సూర్య శ్రీనివాస్ సాయి మణికంఠ లుకూ ఆదేశించారు ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



# కోడెల శివప్రసాదరావు సేవలు చిరస్మరణీయం

## మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



మైలవరం, సెప్టెంబర్ 16,(అనంత సూర్య ప్రతి నిధి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం శాసనసభ్యులు,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కోడెల శివప్రసాదరావు సేవలను స్మరించుకుంటూ జోహార్ అంటూ నినదించారు.ఈ సందర్భంగా వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కోడెల శివప్రసాదరావు చేసిన సేవలు,ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.వైద్యుడిగా,ప్రజా ప్రతినిధిగా,శాసనసభ స్పీకర్‌గా ఆయన వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారానికి,నియోజకవర్గ అభివృద్ధికి కోడెల శివప్రసాదరావు చేసిన కృషి ప్రజల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోతుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత,పార్టీ బలోపేతానికి చేసిన కృషి పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని వసంత కృష్ణప్రసాదు పేర్కొన్నారు.కోడెల శివప్రసాదరావు ఆశయాలు,ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనిఆయనపిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి నివాళులర్పించారు..

# పలువురు తెదేపా నేతల కుటుంబాలకు

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శ



చందర్లపాడు,సెప్టెంబర్ 16,అనంత సూర్య (ప్రతి నిధి): కూటమినేతలతో కలిసి బుధవారం నాడు కొనయపాలెం గ్రామంలో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఇటీవల కాలంలో గ్రామంలో మరణించిన తెదేపా నేతల కుటుంబాలను పరామర్శించారు.ఈ మేరకు మాజీ వైస్ ప్రెసిడెంట్ వనపర్తి వెంకటేశ్వర్లు,గొణుగుంట్ల వేంకటేశ్వర రావు,తొర్లికొండ పద్మావతి, కళ్యాణపు నాగేశ్వరరావు,మొండితోక మరియమ్మ, జువ్వ విల్సన్ రావు, ఉలవలపుడి నాగేంద్రమ్మ,నవీన్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆ దేవుడు వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని కలగజేయాలని తెలియజేశారు.

# నగరాల కార్పొరేషన్ చైర్మన్ పదవి కోసం ఉద్యమం ఉదృతం

విజయవాడ,సెప్టెంబర్ 16,(అనంత సూర్య ప్రతి నిధి): నగరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని నగరాల సామాజిక వర్గానికి కేటాయించాలనే డిమాండ్‌తో విజయవాడలో ఉద్యమం ఉధృతమైంది.నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయన బాపూజీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది.నగరాల సామాజిక వర్గానికి ఒక్క చైర్మన్ పదవిని కేటాయించేలా కూటమి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని నగరాల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మాటలు కాకుండా నిర్ణయం ప్రకటించాలని కోరారు. నగరాల కార్పొరేషన్ చైర్మన్ పదవి సాధించే వరకు తమ పోరాటాన్నికొనసాగిస్తామని స్పష్టంచేశారు. విజయవాడలో కొనసాగుతున్న నిరాహార దీక్షకు విశాఖపట్నం నుంచి పలువురు నగరాల నాయకులు హాజరై మద్దతు తెలిపారు.విజయవాడ మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.మధురవాడ మాజీ నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు,ఆరో వార్డు అధ్యక్షుడు పోతిన ప్రసాద్,పోతిన ఎల్లాజీ,నాగోతి శ్రీనివాస్‌తో పాటు విశాఖ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు నగరాల నాయకులు దీక్షకు పాల్గొన్నారు



# వినాయక చవితి సంప్రదాయ బద్ధంగా జరపడం ఆదర్శనీయం



విజయవాడ,సెప్టెంబర్ 16,(అనంత సూర్య ప్రతి నిధి): వాతావరణ కాలుష్య రహితంగా, సంప్రదాయ బద్ధంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించడం ఆదర్శనీయమని వెస్ట్ జోన్ ఏ సీ పీ దుర్గారావు అన్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సీ వీ ఆర్ ఫ్లై ఓవర్ పక్కన వున్న పోతిన చిన్నా నగర్ లో ఉన్న అస్త్ర అపార్ట్మెంట్ సెల్లారులో జరుగుతున్న వినాయక చవితి పూజల్లో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.బుధవారం మధ్యాహ్నం వినాయక నిమజ్జనం సందర్భంగా సెల్లారు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ ని ఏ సీ పీ దుర్గారావు, కొత్తపేట పోలీస్ స్టేషన్ సీ ఐ సీ హెచ్చి కొండలరావు లు ప్రారంభించారు.ఉత్సవ కమిటీ సభ్యులు ఏ సీ పీ ని, సీ ఐ ని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వందలాది మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అస్త్ర అపార్ట్మెంట్ పలువురు దంపతులు చేతులు మీదుగా ప్రత్యేక పూజలు నిర్వాంచారు. అనంతరం భారీయత్తు వూరేగింపుగా గణేష్ నిమజ్జనం జరిగింది.

## పవన్ కళ్యాణ్ దృష్టికి ఉదయభాను ద్వారా ఇనాం భూబాధితుల సమస్య

జగ్గయ్యపేట,సెప్టెంబర్ 16,అనంత సూర్య (ప్రతి నిధి): ఇనాం బాధితులు 10 సం.లుగా పడుతున్న అవస్థలను జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు స్వామినేని ఉదయభాను ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్తామని వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ చెప్పారు.ఆయన బుధవారం ఎన్టీఆర్ సర్కిల్లో ఇనాం భూబాధిత సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 9వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని కౌన్సిలర్లు కొలగాని రాము,కాశీ అనురాధ కిషోర్,షేక్ సత్తార్,ఆవుల భవాని ప్రసాద్ తదితరులతో కలిసి ప్రారంభించారు.సమస్య గత పదేళ్ల గా అన్ని రాజకీయ పార్టీల మేనిఫెస్టో పేర్కొంటున్నప్పటికీ పరిష్కారం కాకపోవటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.ఇనాం బాధితులు సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగించాలని, తమ సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు.కౌన్సిలర్ కొలగాని రాము మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ సమస్యపై కనీస సానుభూతి లేదని జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా ఉదయభాను ఉన్న సమయంలో సమస్య పరిష్కారానికి కృషి చేసిన జగన్ పాదయాత్రలో సమస్య రాలేదని పట్టించుకోలేదని విమర్శించారు. ఈసారి సమస్య పరిష్కారం కావాల్సిందేనని అందుకు బాధితులు చేస్తున్న న్యాయబద్ధమైన ఆందోళనకు మద్దతు ఇస్తామని చెప్పారు.

## జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి - ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, సెప్టెంబర్ 16 అనంత సూర్య జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డి.పి.ఆర్.సి. సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఎంపీ అధ్యక్షత వహించారు. జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజల



సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతి, నిధుల వినియోగం, పెండింగ్ పనులు, ప్రజలకు అందుతున్న సేవలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో దాదాపు 108 కేంద్ర ప్రయోజిత పథకాలు అమలులో ఉన్న నేపథ్యంలో వాటిని సక్రమంగా, సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు నిధుల వినియోగంపై పూర్తి పారదర్శకత ఉండాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశాన్ని నిర్వహించి పథకాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు, వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ఎంపీ ల్యాడ్స్ కింద రూ.12.54 కోట్లతో 154 పనులకు నిధులు మంజూరు కాగా, మిగిలిన రూ.6.31 కోట్లకు సంబంధించిన పనులను త్వరగా గుర్తించాలని సూచించారు. పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అవసరమైన అత్యవసర అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కోరారు. విద్యా రంగంపై కూడా ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించాను. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతపై వచ్చే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థులకు అవసరమైన తాగునీటి సదుపాయాల కోసం అవసరమైతే ఎంపీ నిధులను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతపురం నగరంలోని ట్రెల్లిస్ పాఠశాల ఘటనపై కూడా చర్చించి, త్రీ మెన్ కమిటీ నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్షించామని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటికి, పశుగ్రాసానికి ప్రాధాన్యతనిస్తూ నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ఉద్యాన పంటలు, మొక్కలను సంరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. రుద్రంపేట జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య, కల్లూరు ఆర్.ఓ.బి. వద్ద నీరు నిలిచే సమస్య వంటి స్థానిక మౌలిక వసతుల సమస్యలను కూడా సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలలన్నారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నామని, జల జీవన్ మిషన్ నిధుల కోసం కేంద్ర స్థాయిలో చేసిన విజ్ఞప్తులు, రాయలసీమ వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధుల కోసం పార్లమెంట్‌లో చేసిన ప్రయత్నాల ద్వారా అనంతపురం జిల్లాకు మరిన్ని నిధులు సమకూరేలా కృషి కొనసాగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజలకు పూర్తి స్థాయిలో చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు ఐక్యంగా పని చేయాలన్నారు. అనంతపురం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, దిశ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వీ.కోటలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం

వీ.కోట, అనంత సూర్యప్రతినిధి, సెప్టెంబర్ 16: వీ.కోట మండలంలో వినాయక నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా, కనుల పండుగగా జరిగాయి. గణపతి బప్పా మోరియా నినాదాలతో వీ.కోట పట్టణం మార్మోగిపోయింది. ప్రతి వాడ నుంచి వినాయకుని విగ్రహాలను అనేక రూపాల్లో అందంగా అలంకరించి భారీ ఊరేగింపుగా తీసుకువచ్చారు. మైక్ సెట్ల హోరు, డప్పు వాయిద్యాల మోత, కోలాటం, పందరి భజనలు, టపాకాయల మోతతో వీ.కోట వీధులన్నీ కోలాహలంగా మారాయి. యువత ముందుండి ఉత్సాహంగా డ్యాన్సులతో సందడి చేశారు. మత సామరస్యానికి నిదర్శనంగా నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు, ప్రజల కోసం ముస్లిం సోదరులు చలివేంద్రాలు ఏర్పాటు చేసి తేనీటి, త్రాగునీరు అందించడం అందరినీ ఆకట్టుకుంది. హిందూ-ముస్లిం ఐక్యతకు వీ.కోట మరోసారి నిదర్శనంగా నిలిచింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కీలపల్లి చెరువు, పట్టపల్లి చెరువు వద్ద కట్టుదిట్టమైన శాంతిభద్రతలు ఏర్పాటు చేశారు. పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. వీ.కోట పట్టణ ప్రజలంతా సంతోషంతో, ఆనందోత్సాహాల మధ్య వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## ప్రధానమంత్రి మోదీ జన్మదినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు

ఏలూరు, అనంత సూర్య ప్రతినిధి, సెప్టెంబర్ 16 : ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 8.30 గంటలకు శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో కార్యకర్తలు, ఏలూరు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కీర్తి రాంప్రసాద్ ఆధ్వర్యంలో భక్తిపూర్వక ఆధ్యాత్మిక భావంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు వైవీఎన్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో కళాశాల యువతీ యువకులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు బ్రహ్మంగారి గుడి వద్ద డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 7 గంటలకు బ్రహ్మంగారి గుడి వద్ద మహిళా కోలాట సభ్యులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు కలగాలని, దేశ సేవలో ప్రజలకు సుఖసంతోషాలు అందించాలని ఆకాంక్షిస్తూ దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో గంగుల గణపతులు, గరికపాటి రాంబాబు, శ్యాము, సైదు రామకృష్ణ చంద్రమౌళి, కే. సుదర్శన్ రావు, వై. లక్ష్మీ దీపక్, ఎన్. శ్రీనివాసరావు, కే. భాస్కరరావు, గణేష్, కీర్తి రామ్ ప్రసాద్, పెద్దింటి కళ్యాణి, భలే చిరంజీవి, బీఎస్ రాజు, బోడావుల జగదీష్, పి. శివ శంకర్, బి. శ్రీనివాసరావు, అడవి వెంకట కృష్ణ మోహన్, సిహెచ్. బలరామకృష్ణ రాజు, బొర్ర శ్యామల రాజు గౌడ్ తదితరులు పాల్గొననున్నారు.

## స్థానిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమర సన్నద్ధం కావాలి

### ప్రతి క్లస్టర్, యూనిట్‌లో పటిష్ట సమన్వయంతో ముందుకు సాగాలి



అనంతపురం, సెప్టెంబర్ 16 అనంత సూర్య : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమర సన్నద్ధం కావాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, క్షేత్రస్థాయి సమన్వయం, నాయకులు--కార్యకర్తల మధ్య అనుసంధానం, ప్రజలతో మమేకం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకమైనవి. ప్రతి క్లస్టర్, ప్రతి యూనిట్, బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో సహకరించాలని సూచించారు. అనంతపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. పింఛన్ దరఖాస్తులకు మరో రెండు రోజుల అవకాశం అర్హులైన పింఛన్ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో రెండు రోజుల సమయం కల్పించిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క లబ్ధిదారుడు కూడా అవకాశం కోల్పోకూడదని, తమ పరిధిలోని ప్రజలకు పింఛన్ దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలి. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలకు తెలియజేయడంలో పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## మంత్రి నారా లోకేష్ రాప్తాడు పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు



అనంతపురం, సెప్టెంబర్ 16 అనంత సూర్య : ఐటి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పర్యటనకు రాప్తాడు మండల కేంద్రంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 22వ తేదీన మంత్రి నారా లోకేష్ రాప్తాడులో పర్యటించనున్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుతో పాటు మాజీ మంత్రి పరిటాల రవి కాంస్య విగ్రహాలను రాప్తాడులో ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహాలను ఆవిష్కరించేందుకు ఆయన 22వ తేదీన రాప్తాడుకు రాన్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిటాల సునీత స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సునీత సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ రాప్తాడుకు రానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో ఒక కొత్త ఉత్సాహం కనిపిస్తోందన్నారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో ఎన్టీఆర్ తో పాటు పరిటాల రవి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నామని ఇన్ని రోజులకు ఆ కల నెరవేరబోతోందని అన్నారు. ఈ విగ్రహాల ఆవిష్కరణకు మంత్రి నారా లోకేష్ రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ పర్యటనకు

## మెరుగైన ఆరోగ్యంతోనే స్థిరమైన అభివృద్ధి

### - బోర్డు సదస్సులో సీఈఓ ఆవుల చంద్రశేఖర్

విజయవాడ, సెప్టెంబర్ 15 అనంత సూర్య : ప్రకృతి ప్రసాదించిన ఔషధాలతో దుష్ఫలితాలు ఉండవని, మెరుగైన ఆరోగ్యం తోనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమని ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు (ఏపీఎంఏపీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ అన్నారు. విజయవాడలోని బోర్డు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏపీ ఫారెస్ట్ అకాడమీ (రాజమహేంద్రవరం)లో శిక్షణ పొందుతున్న 35 మంది అటవీశాఖ బీట్ అధికారులు డైరెక్టర్ విజయకుమార్ ఆదేశాల మేరకు అధ్యయనయాత్ర సాగించారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం విజయవాడ, మంగళగిరి ప్రాంతాల్లో క్షేత్రసాయిలో పరిశీలించారు. మంగళగిరి సమీపంలోని 'ఎమిస' హెర్బల్ పరిశ్రమను తొలుత సందర్శించి, దాదాపు 100 ఏళ్లుగా సాగిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ముడిసరుకు సేకరణ, విలువ ఆధారిత సేవలు, సమగ్ర తయారీ విధానం, మార్కెటింగ్ పద్ధతులు, గోదాములను పరిశీలించారు. తర్వాత విజయవాడలోని ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు కార్యాలయాన్ని ప్రత్యేకంగా సందర్శించారు. బోర్డు కార్యాలయం ప్రాంగణంలోని మ్యూజియం, ప్రయోగశాల, గోదాములతో పాటు సీఈవో పరిశోధించి రాసి, ప్రచురించిన అమూల్యమైన గ్రంథాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు 452 రకాల



మొక్కలు, 225 రకాల ఔషధ పంట సాగు విధానాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో సీఈవో ఆవుల చంద్రశేఖర్ మాట్లాడారు. బోర్డు పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్, నమూనా వీడియోల ద్వారా ప్రత్యేకంగా ప్రదర్శించారు. వివిధ రకాల వ్యాధులు వాటి నివారణకు ఉపయోగించాల్సిన ఔషధ మొక్కలను గురించి సీఈవో వివరించారు. వయస్సు నియంత్రణకు, చర్మం ముడతలు పడకుండా శంకు పుష్పం దోహదపడుతుందని చంద్రశేఖర్ పేర్కొన్నారు. బ్రెయిన్ చురుగ్గా ఉండటానికి, నరాలను శక్తివంతం చేయడానికి కూడా ఇది ఉపయోగపడుతుందన్నారు. వందరకాల మొక్కల సమస్యరక్షణ, పంటల సాగు, వన సంరక్షణ సమితులతో సమన్వయం గురించి సమగ్రంగా వివరించారు. ఎర్రచందనం, టేకు, రోజ్ వుడ్ లాగా ఔషధ మొక్కల పెంపకం కూడా ఎంతో విలువైందని స్పష్టంచేశారు. ఎల్ నినో ప్రభావంతో పాటు, ప్రకృతి వైపరీత్యాలకు కారణం, భూగర్భజలాల పెంపు, అగ్ని ప్రమాదాల నివారణ వంటి వాటి గురించి చర్చించారు. మధుమేహం, మూర్ఛ, పక్షవాతం వంటి వ్యాధుల నివారణకు ఉపయోగించే ఔషధ మొక్కలను నమూనా వీడియో ద్వారా ప్రదర్శించారు. వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థల సమన్వయంతో సీఈవో రాసి ప్రచురించిన పుస్తకాల గురించి ప్రత్యేకంగా సదస్సులో వివరించారు. దాదాపు 789 రకాల ఔషధ మొక్కల నుంచి వివిధ వ్యాధుల నివారణకు ఉపయోగించే విధానాన్ని వెల్లడించారు. ఎలాంటి దుష్ప్రభావాలు లేని ప్రకృతి ఔషద మందులు వాడడం ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫారెస్ట్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు శ్రీనివాసరావు, రామారావు, ఏపీఎంఏపీ డిప్యూటీ సీఈవో ప్రదీప్, పుత్తూరు శల్య వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ రాజు, ఎమిస్ ఫార్మసిటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డా. వి.నాగలక్ష్మి, ఆయుర్వేద వైద్య నిపుణులు డా. ఏ.ఆనంద్, డాక్టర్ వి.శ్రీకాంత్, బి.తరుణ్ కుమార్, మేనేజర్లు సిహెచ్ హోమకోటి, ఎలఎన్ రావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఏపీఎంఏపీ సాంకేతిక నిపుణులు ప్రసాద్, విజయకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణేశుడి సన్నిధిలో డీసీ కుటుంబం

### - ప్రత్యేక పూజలు నిర్వహణ అన్నదానం చేసిన డీసీ మంజు, డీసీ లోకేష్ దంపతులు

పెనుకొండ,. అనంత సూర్య ప్రతినిధి, సెప్టెంబర్ 16: పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో బుధవారం మాస్టర్ వీవర్, సీనియర్ రాజకీయ నాయకులు డీసీ ఈశ్వరయ్య, డీసీ రత్నమ్మ, వారి కుమారులు డీసీ మంజు, డీసీ లోకేష్ దంపతులు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేతలు, రైతులు, కార్మికులు బాగుండాలని ఆకాంక్షించారు. ఎల్‌నీనో ప్రభావం తగ్గి



త్వరగా వర్షాలు కురవాలని, మూగజీవాలు, పక్షులకు తాగునీరు పుష్కలంగా అందాలని, ప్రతి చెరువు నిండాలని గణేశుడిని ప్రార్థించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు డీసీ మంజు, డీసీ లోకేష్ దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొని గణేశుడి ఆశీస్సులు పొందారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405